RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 271 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

మంగళవారం 4 జూన్ 2024

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03:** అనుకున్న సమయానికి ముందే మే 30న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలుక్రమంగా ముందుకు కదులుతున్నాయి. నైరుతి రుతుపవనాల రాకతో కేరళవ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.ఇక, అక్కడ నుంచి కర్ణాటక మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి రుతుపవనాలు ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాలు ఏపీని తాకాయి. రుతుపవనాలు రాయలసీమలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించింది. రుతపవనాల ప్రభాతంతో రాష్ట్రంలో కొన్ని చోట్లు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడనున్నాయి. తొలుత ఈ నెల 4-5 తేదీల్లో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని భావించగా.. ముందుగానే ప్రవేశించాయి. రుతుపవనాలు రాయలసీమ మీదుగా ప్రవేశించి రాష్ట్రమంతా విస్తరిస్తాయని ఐఎండీ తెలిపారు.

## సంక్షేమం వైపా..?





## అభివృద్ధి వైపా..?

# ఏపీ ప్రజలు ఎటువైపు...?

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03: ఏపీ ప్రజలు సంక్షేమానికి ఓటు వేశారా? అభివృద్ధికి జై కొట్టారా? అన్నది మరికొద్ది గంటల్లో తెలిసిపోనుంది.నేడు ఉదయం 8:00గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ను ప్రారంభించనున్నారు. దీంతో అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఒక రకమైన టెన్షన్ కనిపిస్తోంది. అయితే ఈసారి ప్రజలు ఎటువైపు మొగ్గుతారా? అన్నది హాట్ టాపిక్ గా మారింది. 2014 రాష్ట్ర విభజనతో ఏపీ ప్రజలు ఒక స్ట్రాంగ్ నిర్ణయానికి వచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ కు ఒక అనుభవజ్ఞుడైన నాయకుడు కావాలని భావించారు. అప్పటికే వరుస రెండు ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది. సీనియర్ నేతగా గుర్తింపు ఒకవైపు, రెండుసార్లు ఓడిపోయారని సానుభూతి మరోవైపు బాగా వర్కౌట్ అయ్యింది. చంద్రబాబు అధికారంలోకి రాగలిగారు. కానీ 2019 ఎన్నికలకు వచ్చేసరికి ఏపీ ప్రజలు సంక్షేమానికి జై కొట్టారు. ఉచిత పథకాలకు ఓటు వేశారు. జగన్ ను అంతులేని మెజారిటీతో గెలిపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఎటువైపు నిలబడ్డారు అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.ఏపీలో ఇప్పుడు ఎవరు అధికారంలోకి వచ్చినా సంక్షేమం తప్పనిసరి. అదే సమయంలో అభివృద్ధి కావాలి. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సంక్షేమాన్ని అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉచిత పథకాలను ప్రజలకు అందించగలిగారు. అయితే ఆ సంక్షేమాన్ని ప్రజలు ఎంతవరకు విశ్వసించారు అన్నది చూడాలి. అయితే అభివృద్ధి అనేది కనిపించలేదు. అమరావతి రాజధాని నిర్వీర్యం అయ్యింది. మూడు రాజధానులు పురుడు పోసుకోలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. సరిహద్దు దాటి ఏపీలోకి పరిశ్రమలు రాలేదు. ఈ పరిణామాలన్నీ జగన్ కు ఇబ్బందికరమే. అయితే అప్పటివరకు అభివృద్ధి మంత్రాన్ని పఠించిన చంద్రబాబు సైతం.. నవరత్నాలకు దీటుగా సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. సంపద సృష్టించి.. అభివృద్ధి చేసి.. పథకాలను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. అదే సమయంలో నవరత్నాలకు కొద్దిపాటి పెంపు చేసి మేనిఫెస్టోను జగన్ ప్రకటించారు. అయితే ఈ ఇద్దరిలో ప్రజల విశ్వాసం అందుకున్నది ఎవరు అన్నది మరికొద్ది గంటల్లో తేలనుంది.

ఈ పరిణామాల క్రమంలో ఏపీ ప్రజలు ఎటువైపు మొగ్గు చూపారు? అన్నది సస్పెన్స్ గా మారింది. అయితే మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వే సంస్థలు మాత్రం టిడిపి కూటమి అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వస్తుందని తేల్చి చెప్పాయి. అయితే ప్రజలకు విరివిగా సంక్షేమ పథకాలు అందించామని.. ప్రజల విశ్వాసం తమకు ఉందని.. తమకంటూ ప్రత్యేక ఓటర్లు ఉన్నారని వైసీపీ విశ్వసిస్తోంది. అదే సమయంలో ప్రభుత్వం పై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉద్యోగ ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. ఓటింగ్ శాతం 82 గా నమోదయింది. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు సూచికమని.. అందుకే తాము అధికారంలోకి వస్తామని టిడిపి కూటమి చెబుతోంది. గెలుపు పై ఎవరి ధీమా వారిదే. కానీ ప్రజలు ఎవరిని నమ్మారో? ఎవరిని నమ్మలేదో? మరికొద్ది గంటల్లో తెలియనుంది.

## సుప్రీంకోర్టులో వైసీపీ కి చుక్కెదురు..!

-వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది.

-కేంద్ర ఎన్నికల సంఘం నియమాలను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

-పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.



2లో

## పిన్నెల్లిపై సుప్రీంకోర్టు ఆంక్షలు

### - కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని ఆదేశం.!

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ/ మాచర్ల జూన్ 03: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసులో పిన్నెల్లిని అరెస్టు చేయాలని, అరెస్టుకు హైకోర్టు ఇచ్చిన వెసులుబాటు ఎత్తివేయాలని నంబూరి శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. ఈ నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలోకి పిన్నెల్లి వెళ్లొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది

మిగతా 2లో



## ఈసీ v/sవైసీపీ..
## ఏపీలో ఏం జరుగుతోంది..?

ఆంధ్ర ప్రగతి అమరావతిజూన్ 03: ఏపీ రాజకీయాలు ఎన్నికల కమిషన్ వర్సెస్ వైసీపీ అన్నట్టుగా మారిపోయాయి. ఈసీ కూటమి చేతిలో పావుగా మారిందని వైసీపీ బహిరంగంగానే విమర్శలు చేస్తోంది. మరోవైపు ఈసీ కూడా టీడీపీ ఫిర్యాదులన్నిటిపై వెంటనే స్పందిస్తూ, వైసీపీ ఆరోపణలను పెడ చెవిన పెట్టడంతో ఈ విమర్శలకు బలం చేకూరింది.ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ అంశంలో ఈసీ, వైసీపీ తాడోపేడో తేల్చుకోబోతున్నాయి. వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది.పోలింగ్ కి ముందు ఏపీలో కీలక అధికారుల్ని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. కూటమి ఫిర్యాదులే ఈ బదిలీకి కారణం. అలా బదిలీలు జరిగిన చోటల్లా ఎన్నికల రోజు హింస జరిగింది. వైసీపీకి నష్టం చేసేలా టీడీపీ రెచ్చిపోయింది. పల్నాడులో జరిగిన హింసకు, రిగ్గింగ్ కి ఈసీ పరోక్ష సహకారం ఉందని, పోలీసులు కూడా టీడీపీతో కలసిపోయారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇక ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంని ధ్వసం చేసిన వీడియో.. ఈసీ, వైసీపీ మధ్య మరింత దూరం పెంచింది. ఆ వీడియోని ఉద్దేశపూర్వకంగానే టీడీపీ చేతికి ఇచ్చి లీక్ చేయించారనేది వైసీపీ ఆరోపణ. పైగా ఆ వీడియో



బయటకొచ్చాక పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకు ఈసీ, పోలీస్ వ్యవస్థ తీవ్రంగా ప్రయత్నించాయి. చివరకు కోర్టు జోక్యంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంతో ఏపీ ఎన్నికల అధికారులు పూర్తిగా టీడీపీకి అనుకూలంగా ఉన్నారనే ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. కౌంటింగ్ రోజు కూడా వ్యవస్థలన్నీ ఈసీ కంట్రోల్ లోనే ఉంటాయి. ఈ దశలో వైసీపీ కూడా కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తోంది. టీడీపీ ఉద్దేశపూర్వకంగానే గొడవలు సృష్టించే అవకాశముందని ఆరోపిస్తున్నారు వైసీపీ నేతలు. ఈసీ సహకరిస్తే, ఫలితాలను తారుమారు చేసేందుకు చూడా వారు వెనకాడరని, పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మొత్తానికి ఏపీలో పోటీ కూటమి, వైసీపీ మధ్య కాకుండా.. ఇప్పుడు వైసీపీ వర్సెస్ ఈసీ అన్నట్టుగా మారిపోయింది.

## సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు.

-యూజర్లు, అడ్మిన్‌లకు హెచ్చరిక.

- తేడా వస్తే రౌడీషీట్ ఖాయం.

- డిజీపీ హరీష్ కుమార్ గుప్తా.



ఆంధ్ర ప్రగతి మంగళగిరి జూన్ 03: సోషల్ మీడియా యూజర్లు, అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు పోలీసులు. రెచ్చగొట్టేలా పోస్టులు ఉంటే మాత్రం రౌడీషీట్ ఖాయమని చెబుతున్నారు.

మిగతా 2లో

## సుప్రీంకోర్టులో వైకాపాకు వరుస ఎదురుదెబ్బలు.!

### -చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్ కొట్టివేత.

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ చంద్రగిరి జూన్ 03: చంద్రగిరి వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చంద్రగిరి నియోజకవర్గంలో ఫారం 17ఏ, ఇతర డాక్యుమెంట్ల విషయాన్ని మరోసారి పరిశీలించాలని.. నాలుగు కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని ఆయన పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిలో జోక్యం చేసుకునేందుకు కారణాలేమీ కనిపించట్లేదని పేర్కొంది. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ బూత్‌లో అక్రమాలు జరిగాయని మోహిత్ రెడ్డి తన



పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన పిటిషన్ ఈ దాఖలు చేసిన విషయం తెల్సిందే.

# సుప్రీంకోర్టులో వైసీపీ కి చుక్కెదురు..!

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ జూన్ 03:
పోస్టల్ బ్యాలెట్లపై యాగీ చేసిన వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వైఎస్సార్సీపీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, సీల్ ఉండాల్సిన అవసరం లేదన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై హైకోర్టు ఆదేశాలను వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. 4వ తేదీన కౌంటింగ్ ఉండగా ఈ దశలో జోక్యం చేసుకోవడం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్సీపీ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు పేర్కొంది. గతంలో ఇదే అంశంపై వైఎస్సార్సీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించగా, జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఒకవేళ పోస్టల్ బ్యాలెట్ల పరంగా ఏవైనా పొరపాట్లు ఉంటే కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల పిటిషన్ వేయాలని సూచించింది. కమిషన్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేది లేదని కుండబద్దలు కొట్టింది. కాగా పోస్టల్ బ్యాలెట్ల వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం కొద్ది రోజుల ముందే కీలక ఆదేశాలు ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్?కు సంబంధించి 13ఏ ఫాంపై అటెస్టేషన్ అధికారి సంతకం మాత్రమే ఉండి, సీల్, హోదా లేకపోయినా ఆ ఓటు చెల్లుతుందని తెలిపింది. సదరు పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని, వాటిని చెల్లుబాటు అయ్యే ఓటుగా గుర్తించాలని ఆర్వోలకు ఆదేశాలు జారీ చేసింది. రిటర్నింగ్ అధికారి ధృవీకరణ తరవాతే అటెస్టేషన్ అధికారి ఫాం 13 ఏ పై సంతకం చేశారని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ సీఈవోకు లేఖ సైతం రాసింది. అయితే ఈసీ నిబంధనలపై వైస్సార్సీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ల విషయంలో వైఎస్సార్?సీపీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన న్యాయస్థానం, ఈసీ నిర్ణయంపై తాము జోక్యం చేసుకోలేమంటూ స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు వీల్లేదని, పిటిషనర్‌కు అభ్యంతరం ఉంటే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలన్న ఎన్నికల సంఘం వాదనతో ఏకీభవించింది. ఈసీ సమర్పించిన పలు తీర్పులను సైతం పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల కమిషన్ నిర్ణయంపై పిటిషనర్‌కి ఏమైనా అభ్యంతరం ఉంటే ఎన్నికలు ముగిశాక ప్రత్యామ్నాయ మార్గాన్ని అనుసరించే స్వేచ్ఛనిచ్చింది.
దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అయితే సుప్రీంకోర్టులో కూడా వైఎస్సార్సీపీకి చుక్కెదురైంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోమంటూ తేల్చిచెప్పింది. ఏవైనా పొరపాట్లు ఉంటే కౌంటింగ్ ప్రక్రియ పూర్తైన తరువాత పిటిషన్ వేయాలని సూచించింది.

# ఎన్టీఆర్ ఫౌండేషన్ కు మన్నవ మోహన్ కృష్ణ
# రూ.2 కోట్లు విరాళం.

**-టీడీపీ అధినేత చంద్రబాబు కు చెక్కు అందజేత.**




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03:
ఎన్టీఆర్ ట్రస్ట్ అనుబంధ విభాగమైన ఎన్టీఆర్ ఫౌండేషన్ కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్ కృష్ణ రూ.2 కోట్లను విరాళంగా అందించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును సోమవారం ఉండవల్లి నివాసంలో కలిసి చెక్కు అందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఎంతో మంది పేద విద్యార్థులను ట్రస్టు ద్వారా చదివిస్తున్నారన్నారని మోహన్ కృష్ణ అన్నారు. విరాళం అందించిన మోహన్ కృష్ణను చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి, ఎన్ఆర్ఐ గొట్టిపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


# పిన్నెల్లిపై సుప్రీంకోర్టు ఆంక్షలు

*(మొదటి పేజీ తరువాయి)*

మాచర్లలో ఈవీఎం ధ్వంసం ఘటనలో అడ్డుకునేందుకు యత్నించిన నంబూరి శేషగిరిరావు తనకు ప్రాణభయం ఉందని, పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసులో పిన్నెల్లిని అరెస్టు చేయాలని, అరెస్టుకు హైకోర్టు ఇచ్చిన వెసులుబాటు ఎత్తివేయాలని నంబూరి శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈనెల 6 వరకు అరెస్టు చేయవద్దన్న వెసులుబాటు ఎత్తివేయాలని పిటిషన్ దాఖలు చేయగా, ఆయన కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని సుప్రీం ఆదేశించింది.
పిన్నెలి రామకృష్ణా రెడ్డికి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఇచ్చిన రక్షణ పైన నంబూరి శంకర రావు దాఖలు చేసిన ఎస్?ఎల్?పి పైన ఈ రోజు సుప్రీంకోర్టులో జస్టిస్ అరవింద్ కుమార్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం తప్పు పట్టింది. ఇది న్యాయాన్ని అవహేళన చెయ్యటమే అని మండిపడింది. సీనియర్ న్యాయవాది ఆదినారాయణ మరియు జవ్వాజి శరత్?లు వాదిస్తూ ఎలక్షన్ కమిషన్?కు సంబంధించిన వెబ్ కాస్టింగ్ వీడియోలను ధర్మాసనం ముందు ప్రదర్శించారు. అది చూసి రామకృష్ణా రెడ్డికి సంబంధించిన న్యాయవాదిని దీనికి ఏమి సమాధానం చెప్పగలవు అని అన్నారు. దాని గురించి తానేమీ అనదలుచుకోలేదు అని అన్న తరువాత కోర్టు జడ్జిమెంట్ పాస్ చేసింది.
పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కౌంటింగ్?కు సంబందించిన పరిసరాలలోకి రాకూడదని, ఆ విధంగా ఒప్పుకుంటున్నట్టు అఫిడవిట్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణలో అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకుని మాత్రమే హైకోర్టు తగు ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొంది.
మే 13న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మాచర్లలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రం (202)లోకి వెళ్లి, అక్కడ ఈవీఎం ఎత్తి నేలకేసి కొట్టడంతోపాటు వీవీ ప్యాట్ మిషన్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఒక్కసారి పోలింగ్ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అయితే అక్కడే ఉన్న విపక్ష పార్టీ పోలింగ్ ఏజెంట్, టీడీపీ నేత నంబుల శేషగిరిరావుపై ఒక్క ఉదుటున దూసుకెళ్లి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈవీఎం ధ్వంసం చేసిన ఎమ్మెల్యేపైనా ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ దృశ్యాలన్నీ పోలీంగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.
ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం చేసిన అనంతరం అడ్డుకోబోయిన టీడీపీ నేత నంబుల శేషగిరిరావుపై వైఎస్సార్సీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. గ్రామస్థులు ఎదురుతిరగడంతో అనుచరులతో సహా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్కడ నుంచి పరారయ్యారు. సంబంధిత వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. రెంటచింతల మండలంలోని పాల్వాయిగేటు టీడీపీకి గట్టి పట్టున్న గ్రామం. పోలింగ్ రోజున అక్కడ ప్రతిపక్షానికి ఎక్కువ ఓట్లు పడుతున్నాయన్న ఉక్రోషంతో ఎమ్మెల్యే తన అనుచరగణాన్ని వెంటేసుకుని బూత్?లోకి దూసుకెళ్లారు. నంబూరి శేషగిరిరావు తనకు ప్రాణభయం ఉందని, పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఆశ్రయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. ఈ నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలోకి పిన్నెల్లి వెళ్లొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు.

*(మొదటి పేజీ తరువాయి)*



ఆంధ్రప్రదేశ్‌లో మరికొన్ని గంటల్లో ఈవీఎంలు తెరుచుకోనుంది. ప్రజలు తమ అభిప్రాయాలను అందులో ఉంచారు. అది ఎవరి పక్షమో గంటల వ్యవధిలోనే తేలిపోనుంది. ఈలోపే చాలా మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థి శిబిరంపై విమర్శలు కురిపిస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలాంటివే పెను ప్రమాదానికి కారమణవుతాయని గ్రహించిన పోలీసులు ముందస్తు హెచ్చరిక జారీ చేశారు. కౌంటింగ్ టైంలో పోలీసులు సోషల్ మీడియాలో నిఘా పెట్టారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. గీత దాటితే తాటతీస్తామంటున్నారు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా. ప్రత్యర్థులను రెచ్చగొట్టినా, ఇతరులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా చూస్తూ ఊరుకోబోమంటున్నారు. కచ్చితంగా చర్యలు ఉంటాయని అందుకే అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.
సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడటం, రెచ్చగొట్టే కామెంట్స్ చేన వారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా వివిధ గ్రూప్‌లను క్రియేట్ చేసి నిర్వహిస్తున్న అడ్మిన్‌లు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తప్పుడు పోస్టులను నియంత్రించాల్సి ఉంటుందని అంటున్నారు. లేకుంటే ఐటియాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు మరింత సంయమనం పాటించాలని రెచ్చగొట్టే పోస్టులు పెట్టి కష్టాలు కొనితెచ్చుకోవద్దని హితవుపలుకుతున్నారు. ఏమైనా తేడాగా పోస్టులు కనిపిస్తే పిడి యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడేది లేదని అంటున్నారు. అలాంటి పోస్టులు ఎవరి ప్రోత్సాహంతో పెడుతున్నారు. కారణాలు ఏంటని పూర్తిగా విచారించి భాగమైన వారందరిపై కూడా కేసులు బుక్ చేస్తామని చెబుతున్నారు. రెచ్చగొట్టే కామెంట్స్‌తోపాటు ప్రత్యర్థులను ఆగ్రహం తెప్పించే పోస్టులు, ఫొటోలు, వీడియోలు, స్టేటస్లు పెట్టుకున్నా ప్రమాదకరమని అంటున్నారు. అందుకే కేవలం అడ్మిన్‌లు మాత్రమే పోస్టులు పెట్టుకునేలా సెట్టింగ్ మార్చుకోవాలని సూచిస్తున్నారు. అలాంటివి మీకు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో కూడా షేర్ చేసుకోవద్దని అంతా అలర్ట్‌గా ఉండాలని అంటున్నారు. సోషల్ మీడియాపై పోలీసు నిఘా నిరంతరం ఉంటుందని కచ్చితంగా ఏమాత్రం ఏమరుపాటుగా ఉంటే కేసుల్లో ఇరుక్కొని జీవితాతం స్టేషన్లు చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే వారిని పంపించి వేయండి.




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03:
ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా కీలక ఆదేశాలు జారీ చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంతరాలు కలిగించేందుకు యత్నించే వారిని నిర్దాక్షిణ్యంగా బయటకు పంపించి వేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే వారిని, ఆర్వో ఆదేశాలను పాటించడంలో విఫలమైన ఏ వ్యక్తిని అయినా ఓట్ల లెక్కింపు స్థలం నుంచి పంపించి వేయాలన్నారు. లెక్కింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

### శాంతి భద్రతల బాధ్యత పోలీసులదే

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. తీవ్రమైన పోటీ కారణంగా భావోద్వేగాలు అదుపు తప్పే అవకాశం ఉందని, ఓట్ల లెక్కింపు రోజున, తర్వాత అత్యంత శ్రద్ధతో శాంతిభద్రతలను నిర్వహించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఆటంకాలు తలెత్తితే వాటిని ధృఢంగా, నిర్ణయాత్మకంగా పరిష్కరించాలన్నారు. రాజకీయంగా సున్నితమైన ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలను కఠినంగా అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను, ఇబ్బంది కలిగించే వారిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తప్పుడు వార్తలు, పుకార్లను వెంటనే ఖండించాలన్నారు.

### మార్గదర్శకాల మేరకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు

పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపు విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని సీఈఓ ముకేశ్ కుమార్ మీనా సూచించారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ప్రతి ఈవీఎంకు సీల్ వేసి భద్రపరచాలని ఆదేశించారు. ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫాం-21సీ/21ఈ లను కౌంటింగ్ మరుసటి రోజే కేంద్ర ఎన్నికల సంఘానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగకూడదని, ఇండెక్స్ కార్డులో తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా పూరించాలని సూచించారు. ఈ నెల 8 లోపు ఇండెక్స్ కార్డులు అన్నీ కార్యాలయానికి అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ప్రతి కౌంటింగ్ టేబుల్కు ఏజెంట్
ఎన్నికల నియమావళి ప్రకారం కౌంటింగ్ సందర్భంగా ప్రతి కౌంటింగ్ టేబుల్కు ఒక ఏజెంట్ను నియమించుకునే అవకాశాన్ని అభ్యర్థికి కల్పించాలని సీఈఓ సూచించారు. ఆర్వో టేబుల్ వద్ద అభ్యర్థి లేనప్పుడు మాత్రమే ఏజెంటుకు అవకాశం కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇతరులు కౌంటింగ్ కేంద్రాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ఏజెంట్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ఏజెంట్ చేతిలో ఫాం-17సీ, పెన్ను లేదా పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మాత్రమే ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఆ జర్నలిస్టులు అందరికి అవకాశం

అథారిటీ లెటర్స్ కలిగిన పాత్రికేయులు అందర్నీ మీడియా కేంద్రంలోకి అనుమతించాలని, వారి వద్ద సెల్ఫోన్ ఉన్నప్పటికీ అభ్యంతరం చెప్పొద్దని సీఈఓ మీనా సూచించారు. కానీ కౌంటింగ్ సెంటర్లోకి మాత్రం సెల్ఫోన్తో అనుమతించడానికి వీల్లేదని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలన్నీ అగ్ని రక్షణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, అందుకు తగ్గట్టుగా అగ్నిమాపక శాఖ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశ, నిష్క్రమణ ప్రణాళిక పటిష్ఠంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రణాళికకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తప్పనిసరిగా ఉండాలన్నారు.

# సజ్జలకు నోటీసులు..
# పేర్ని నాని పై కేసు..!






ఆంధ్ర ప్రగతి తాడేపల్లి జూన్ 03: వైసీపీ నుంచి అధికార పగ్గాలు చేజారిపోతున్నాయనడానికి స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా తన మౌఖిక ఆదేశాలతో పోలీసు శాఖను ఉరుకులు పరుగులు పెట్టించిన సజ్జలపై తాడేపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. నమోదు చేసి ఊరుకోలేదు.. ఈ నెల 5న అంటే కౌంటింగ్ ముగిసి, ఫలితాలు వెలువడిన మరుసటి రోజు విచారణకు రావలసిందిగా నోటీసులు సైతం జారీ చేశారు. ఎగ్జిట్ పోల్స్ మేరకు వైసీపీ పరాజయం పాలైతే.. క్రిమినల్ కేసులో విచారణ తరువాతి మర్యాద అరెస్టే అవుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కౌంటింగ్ రోజున రూల్స్ గీల్స్ అంటూ కూర్చోవద్దు రెచ్చిపోండి అంటూ కౌంటింగ్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేసిన కేసులో సజ్జలపై క్రిమినల్ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి విచారణకు జూన్ 5న రావాల్సిందిగా తాడేపల్లి పోలీసులు సజ్జలకు నోటీసులు జారీ చేశారు. ఇలా ఉండగా పేర్నినానిపై కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు కేసు నమోదు చేయడానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని అధికారులను భయపెట్టేలా చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం మచిలీపట్నం తెలుగుదేశం నాయకులు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడానికి పోలీసులు సమాయత్తమౌతున్నట్లు తెలుస్తోంది.

# ఓట్ల లెక్కింపు సిబ్బందికి రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి.

**-జిల్లా ఎన్నికల అధికారి,**
**కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:
సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా 746 మంది కౌంటింగ్ సిబ్బందిని ఆరు నియోజకవర్గాలను కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు.
సోమవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ భారత ఎన్నికల కమీషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా మే 24వ తేదీ కౌంటింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామన్నారు. సోమవారం రెండో విడత రాండమైజేషన్ ద్వారా 120 శాతం రిజర్వుతో కలిపి మొత్తం 746 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఇందులో 221 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 278 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 247 మంది మైక్రో అబ్జర్వర్లను ఆరు నియోజకవర్గాలను కేటాయించామని కలెక్టర్ తెలిపారు. రెండో విడత రాండమైజేషన్ నియమించిన సిబ్బందికి కూడా వెంటనే కౌంటింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు 3వ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్ లో కౌంటింగ్ నిర్వహించాలో తెలపడం జరుగుతుందన్నారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, 134 - ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అన్నవి దినేష్ కుమార్, 135 - శ్రీశైలం అబ్జర్వర్ భగవత్ కిషోర్ మిశ్రా, 136 - నందికొట్కూర్ అబ్జర్వర్ అభిజిత్ ముఖర్జీ, 139 - నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ రాహుల్ సింగ్, 140 - బనగానపల్లె అబ్జర్వర్ డా. వేద్ ప్రకాష్ మిశ్రా, 141 - డోన్ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అమిత్ కుమార్, సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్ఐసి డిఐఓ అలెన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి.


**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:
సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలెట్ ని లెక్కించడం జరుగుతుందని, అనంతరం 30 నిమిషాల తర్వాత ఈవీఎం కౌంటింగ్ మొదలవుతుందని కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు సహకరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఎలక్షన్ కమిషన్ కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పోస్ట్ ద్వారా వచ్చి కలెక్టరేట్లో స్టోరేజ్ చేసిన సర్వీస్ ఓటర్లు ఈటీపీబిఎస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 5 గంటలకు ఆర్జీఎంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తామని.... రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు ఇతర సాంకేతిక పరికరాలను అనుమతించమని ఈ విషయాన్ని గుర్తెరిగి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి తరపున మనోహర్ రెడ్డి, బీఎస్పీ తరపున చిన్న మౌలాలి, వైయస్సార్సీపీ తరపున గోపాల్, స్వతంత్ర అభ్యర్థులు జగదీష్, గోవర్ధన్ రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూముల వేలం పాటల్లో నిరుపేదలకు అవకాశం కల్పించండి

**-పేదలు సాగు చేస్తున్నదేవాలయ భూములు పేదలకే కౌలుకి ఇవ్వండి.**
**-వర్షాభావం వల్ల గత సంవత్సరం పంటనష్టపోయిన రైతులకే మళ్లీ కౌలుకి ఇవ్వండి.**
**-ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:
నంద్యాల జిల్లాలో వేలాది ఎకరాల్లో దేవాలయ భూములు బహిరంగ వేలం ద్వారా భూస్వాములు ధనిక రైతులకే దక్కుచున్నవి. వాస్తవంగా భూమి లేని నిరుపేదలు బహిరంగ వేలం పాటల్లో పోటీ పడలేక కూలీలుగా మిగిలిపోతున్నారు. ఇప్పటికే జిల్లాలోని అనేక గ్రామాల్లో సంవత్సరాల నుండి సాగుకు నోచుకోనటువంటి దేవాలయ భూములను సాగులోకి తీసుకువచ్చి, అనుభవిస్తున్న పేదవారిని రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ వేలం ద్వారా సాగు భూములకు దూరం చేసింది. ఫలితంగా పేదలు తీవ్రంగా నష్టపోయారు. కావున నంద్యాల జిల్లాలోని నిరుపేదల బ్రతుకుల్లో మార్పు రావటం కోసం జిల్లా ఎండోమెంట్ అధికారులు , రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని దేవాలయ భూములు బహిరంగ వేలం జరిగే ప్రతి గ్రామంలో నిరుపేదలకే ప్రాధాన్యత నివ్వాలని, ఇప్పటికే సాగు చేసుకుని అనుభవిస్తున్న భూములను పేదవారికి కౌలుకి ఇవ్వాలని, గత సంవత్సరం బహిరంగ వేలం ద్వారా భూములు పొంది వర్షాభావం, అకాల వర్షం వల్ల తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతులకు ఈ సంవత్సరం కూడా ఖచ్చితంగా వారికే కౌలుకుఇవ్వాలని, కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నంద్యాలజిల్లా ఎండోమెంట్ అధికారి కి, వారి లేనందు వల్ల వారి ఆఫీసులోని జూనియర్ అసిస్టెంట్ కృష్ణ కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు వి సుబ్బారాయుడు, సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, సుధాకర రెడ్డి, కౌలు రైతులు శివరామిరెడ్డి, జి వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రవరం మండలంలోని ఎల్లావత్తల గ్రామంలో గత 25 సంవత్సరాల నుండి సాగులో ఉన్న పేదలని బలవంతంగా భూముల నుండి వెళ్లగొట్టాలని, తాము కూడా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కౌలు చెల్లిస్తామని కోరిన కూడా బహిరంగ వేలంద్వారా భూములకు దూరం చేసినారని, ఆత్మకూరు మండలంలో కృష్ణాపురం గ్రామంలో పేదలను భూముల నుండి వెళ్లగొట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని రుద్రవరం, బండి ఆత్మకూరు, బేతంచెర్ల, నందికొట్కూరు, ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు మండలాల్లోని చాలా గ్రామంలో ఇప్పటికీ పేదలే భూములు సాగు చేస్తున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఎండోమెంట్ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని పేదవాళ్లు అనుభవిస్తున్నటువంటి దేవాలయ భూములకు ప్రభుత్వమే కౌలు ధర నిర్ణయించి, వారికి కౌలుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వమే నిరుపేదలను గుర్తించి గ్రామ సభల్లో వారికి దేవాలయ భూములు కౌలుకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం జిల్లాలో కరువు పరిస్థితుల వల్ల, అకాల వర్షాల వల్ల కాల్వలకు నీళ్లు రాక వేసిన పంటలు యండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. అందువల్ల గత సంవత్సరం కౌలుకు తీసుకున్న వారికి మళ్లీ దేవాలయ భూములు కౌలుకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేలం వేయడం కాకుండా మూడు సంవత్సరాలకు ఒకసారి వేలం పెట్టాలని , తీసుకున్న ప్రతి ఒక్కరికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని , సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం మొదలగు ప్రభుత్వ పథకాలను దేవాలయ భూముల కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

# మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దాం

**డిఎంహెచ్ఓ వెంకటరమణ.**



మలేరియా వ్యతిరేక కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు.

**ఆంధ్ర ప్రగతి రుద్రవరం జూన్ 03:**
రుద్రవరం మండలం పరిధిలోని కోటకొండ సచివాలయం చిన్నయ్య స్వామి చెంచుగూడెం నందు మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలని డిఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డిడిటి 50% ఫస్ట్ రౌండ్ నిర్వహించి. మలేరియా మాసోత్సవం సందర్భంగా చిన్నయ్య స్వామి చెంచుగూడెం నందు మలేరియా వ్యాధి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి ప్రజలకు జిల్లా వైద్యాధికారి ఎం ఓ వి కామేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కలిగించడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలోని మంచినీటి ట్యాంకును 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని దానికి సంబంధించిన రికార్డులు నిర్వహించాలని, ఏ రోజైతే క్లీన్ చేస్తారో ఆ తేదీని వేయాల్సిందిగా పంచాయతీ సెక్రెటరికి ఆదేశించడం జరిగిందన్నారు. అలాగే చిన్నయ్య స్వామి చెంచుగూడెంలోని 55 గృహములు కు మలేరియా మందును స్ప్రే చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని జ్యోతి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్, జిల్లా సహాయ అధికారి, మలేరియా సహాయ అధికారి జిప్రసాద్ రెడ్డి,ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్ర రెడ్డి, హెల్త్ సూపర్వైజర్, ఎమ్మెల్యే హెచ్ పి, సచివాలయం ఏఎన్ఎం,హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాణ్యం కాటసాని అడ్డానా..? గౌరు అడ్డానా...?



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 03:
పాణ్యం నియోజకవర్గం అంటే ముందుగా గుర్తుకొచ్చేది కాటసాని రాంభూపాల్ రెడ్డి. ఆయన ఆరుసార్లు పాణ్యం నుంచి గెలిచి తన అడ్డాగా మలచుకున్నారు. తన అడ్రస్ అదేనని ఆయన అనేక ఎన్నికల్లో ఢంకా భజాయించి చెప్పారు.ప్రజలతో మమేకం అవ్వడం కావచ్చు. ఆయన వ్యవహార శైలి ప్రజలకు దగ్గరగా చేర్చిందంటారు. కేవలం ఫ్యాక్షన్ మాత్రమే కాదు.. ప్రజల మనసులను గెలుచుకున్న నేతగా కాటసాని రాంభూపాల్ రెడ్డి నిలిచారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా పాణ్యం నియోజకవర్గం నుంచి గెలిచారంటే ఆయన సత్తా గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు. ఏడోసారి తన అదృష్టాన్ని ఆయన పరీక్షించుకుంటున్నారు.కాటసాని రాంభూపాల్ రెడ్డి వ్యక్తిగతంగా కూడా ఇమేజ్ ఉన్న వ్యక్తి అని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే ఆయన 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అరవై వేల ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. నాడు అక్కడ వైసీపీ గెలిచింది. కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇప్పటి వరకూ 1985, 1989, 1994లో వరసగా మూడు సార్లు పాణ్యం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 1985, 1999లో టీడీపీ గాలి బలంగా వీచినా ఆయన ఓటమి చవిచూడలేదు. అలాగే 2004, 2009 లో కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినా ద్వితీయ స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో ఆయన వైసీపీలో చేరి టిక్కెట్ తెచ్చుకుని గెలిచారు. ఆయన ట్రాక్ రికార్డు చూసిన వారికి ఎవరికైనా సొంత బలం ఎంత ఉందో ఇట్టే చెప్పకతప్పదు.
ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కాటసాని రాంభూపాల్ రెడ్డికి వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కకపోవడంపై ఆయన అనుచరుల్లో అసంతృప్తి ఉంది. తనకు మంత్రి పదవి దక్కకపోయినా జగన్ ప్రభుత్వంలో తనకు ఇచ్చిన ప్రాధాన్యతను ఆయన గుర్తు చేసి తన అనుచరులను కొంత శాంతపరిచి తనకు అనుకూలంగా మలచుకున్నారని చెబుతారు. అయితే ఇప్పుడు సొంత బలగంతో పాటు, పార్టీ బలం కూడా తోడయింది. దీంతో పాటు సంక్షేమ పథకాలు కూడా బాగా పనిచేయడంతో ఈసారి కూడా గెలుపు తనదేనన్న ధీమాలో కాటసాని రాంభూపాల్ రెడ్డి ఉన్నారు. ఏడో సారి అసెంబ్లీ లోకి అడుగుపెడతామని ధీమాగా కనిపిస్తున్నారు. పోలింగ్ తర్వాత కూడా కాటసాని రాంభూపాల్ రెడ్డి ఫుల్లు కాన్ఫిడెన్స్ గా ఉన్నారు. ఏడో సారి గెలిస్తే తనను జగన్ కేబినెట్ లోకి తీసుకుంటారని కూడా జనంలోకి ఆయన బాగా సంకేతాలను పంపగలిగారు.
మరోవైపు ప్రత్యర్థి గౌరు చరితారెడ్డికి కూడా మంచి పేరుంది. ఆమె 2014లో వైసీపీ నుంచి పాణ్యం నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆ కుటుంబంపై చాలా వరకూ సానుభూతి కూడా ఉంది. 2019 ఎన్నికల్లో తనకు టిక్కెట్ రాదని తెలిసి టీడీపీలోకి గౌరు చరిత దంపతులు వెళ్లారు. టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో గౌరు చరితా రెడ్డి కాటసాని పై దాదాపు నలభై వేల ఓట్ల మెజారిటీతో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు నలభై ఓట్ల మెజారిటీని అధిగమించాలంటే మిరాకిల్ జరగాల్సిందేనన్నది విశ్లేషకుల అంచనా. మరోవైపు కర్నూలు జిల్లాలో వైసీపీ బలంగా ఉండటంతో కొంత ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. అయితే ప్రభుత్వంపై వ్యతిరేకత ఈసారి తనకు కలసి వస్తుందని గౌరు చరితా రెడ్డి అంచనా వేసుకుంటున్నారు. మొత్తం మీద పాణ్యం నియోజకవర్గంలో ఈసారి గెలుపోటములపై పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. అయితే అక్కడ పోలింగ్ ప్రశాంతంగా ముగియడం, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో గెలుపోటములపై ఎవరి ధీమాలో వాళ్లున్నారు.

## రక్త ప్రసరణ వ్యవస్థ ను కనుగొన్న శాస్త్రవేత్త

# విలియం హార్వే సేవలు రస్మరణీయం-

**సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**



ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 03:
జూన్ 03 న రక్త ప్రసరణ వ్యవస్థ ను కనుగొన్న శాస్త్రవేత్త విలియం హార్వే వర్ధంతి సందర్భంగా డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో జూన్ 03 న రక్త ప్రసరణ వ్యవస్థను కనుగొన్న శాస్త్రవేత్త విలియం హార్వే గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. విలియం హార్వే ఏప్రిల్ 1-1578 జన్మించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకుడయ్యాడు. ఈనాడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందో చెప్పగలుగుతున్నారు. అదే 16 వ శతాబ్దం నాడయితే మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విలియం హార్వేకు దక్కుతుంది. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు. ఈయన ప్రయోగాల ద్వారా రాబట్టిన ఫలితాలే ఈ వేళ కూడా రోగ నిర్ణయం చేయటానికి ఉపయోగపడుతున్నాయి. సమాజానికి సేవలు అందించిన మహనీయులను అనుక్షణం స్మరించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన కర్నూల్ రేంజ్ డిఐజి మరియు జిల్లా ఎస్పీ

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:





2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆర్ జి యం ఇంజనీరింగ్ కళాశాలలోని మీటింగ్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులకు బ్రీఫింగ్ నిర్వహించి దిశానిర్దేశం చేసిన కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్ మరియు నంద్యాల జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డికౌంటింగ్ కేంద్రాల చుట్టుపక్కల పరిసరాలు నియోజకవర్గాల వారీగా మరియు పార్కింగ్ ఏరియాలను సెక్టార్ లుగా విభజించి నిర్వహించాల్సిన విధులను క్షుణ్ణంగా వివరించిన ఎస్పీ .కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. మూడంచెల భద్రత పాటు సాయుధ బలగాల ద్వారా ఫుట్ పెట్రోలింగ్ పార్టీ, మొబైల్ పార్టీ లను మొహరించి నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.
ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసే విధంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలి.ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు వారి ఏజెంట్లు మరియు రిటర్నింగ్ అధికారిచే ధ్రువీకరించిన గుర్తింపు కార్డు ఉన్న వ్యక్తులు మినహా ఇతరులు లోపలికి ప్రవేశించకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ఎవరైనా సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలి.కౌంటింగు కేంద్రాలకు విచ్చేసే కౌంటింగు ఏజంట్ల వాహనాలను ప్రత్యేకంగా నిర్ధేశించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయించాలి.కౌంటింగ్ పరిధిలో ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలి.కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను ఆర్ వో గారి ఆదేశాల మేరకు వెంటనే పికప్ వాహనాలలో ఎక్కించాలి.పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. అలసత్వం ప్రదర్శించరాదు. ఎక్కడా చిన్న అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. బందోబస్తు విధుల్లో ఏమి చేయాలో ఏమి చేయకూడదో దిశానిర్ధేశం చేశారు. ప్రతీ ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి బాల్ పెన్ / పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ అనుమతించకుండా కౌంటింగు కేంద్రాల్లోకి పంపాలన్నారు.కౌంటింగు కేంద్రాలు, పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ , 30 పోలీసు యాక్టు అమలులో ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలో మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ బృందాలు, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలు అప్రమత్తంగా ఉంటూ తిరగాలన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరు అయినట్లయితే తప్పకుండా శాఖా పరమైన చర్యలు తీసుకోబడతాయి. ఎక్కడా చిన్న అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.అందరూ మాన్ పాక్స్ మరియు పబ్లిక్ అడ్రెస్ సిస్టంను విరివిగా ఉపయోగించి కమ్యునికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలి.ఇతర విభాగాలతో సమన్వయము చేసుకుంటూ, కౌంటింగ్ ప్రక్రియ కూడా సజావుగా శాంతియుతంగా పూర్తి చేసేందుకు కౌంటింగ్ బందోబస్తులో పాల్గొన్న ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డిఐజి మరియు నంద్యాల జిల్లా ఎస్పీ తో పాటు రైల్వే ఎస్పి రాహుల్ దేవ్ సింగ్ అడిషనల్ ఎస్పి కె. ప్రవీణ్ కుమార్ డీఎస్పీలు కుమారస్వామి రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసరావు, తిలక్, ఆర్మూడ్ రిజర్వు డిఎస్పి శ్రీనివాసులు మరియు బందోబస్తు వచ్చిన పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సినీ నటి హేమ అరెస్ట్

## 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ




ఆంధ్ర ప్రగతి జూన్ 03:
బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టైన సినీ నటి హేమకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీని విధించింది. సీసీబీ పోలీసులు ఆమెను బెంగళూరు శివారు ప్రాంతం అనేకల్ లోని జేఎంఎఫ్‌సీ కోర్టు జడ్జి ఏఎస్ సల్మా ఎదుట హాజరుపరిచారు. జడ్జి ఆమెకు జ్యుడీషియల్ కస్టడీని విధించారు. అంతకుముందు రేవ్ పార్టీ గురించి సీసీబీ పోలీసులు ఆమెను వేర్వేరు కోణాల్లో విచారించారు. ఐదుగురితో కలిసి హేమ రేవ్ పార్టీ నిర్వహించినట్లు గుర్తించారు. ఆ తర్వాత అరెస్ట్ చేసినట్లు ప్రకటించి, జడ్జి ఎదుట హాజరుపరిచారు.

## మీడియాపై హేమ చిందులు

వైద్య పరీక్షల అనంతరం హేమను పోలీసులు బయటకు తీసుకువచ్చిన సమయంలో ఆమె మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై మీడియా తప్పుడు కథనాలు ప్రచురించిందని మండిపడ్డారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదన్నారు. ఇప్పుడే తనను ఇక్కడకు (ఆసుపత్రికి) తీసుకు వచ్చారన్నారు. పరీక్షల కోసం తన హెయిర్, యూరిన్, నెయిల్ (వెంట్రుకలు, మూత్రం, గోళ్లు) శాంపిల్స్ ఇప్పుడే తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రగ్స్ కేసులో తన శాంపిల్స్ ఇదివరకు తీసుకోకపోయినా మీడియా ఎలా నిర్ధారిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు.

# ఓట్లు ఎలా లెక్కిస్తారు? ఎవరెవరు ఏం చేస్తారు?

ఒక నియోజకవర్గ కౌంటింగ్ పర్యవేక్షణ, బాధ్యత రిటర్నింగ్ అధికారిదే
ఆర్వోకు సహాయంగా ఉండనున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు
ఒక టేబుల్ వద్ద కౌంటింగ్ బాధ్యత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిదే
పోస్టల్ బ్యాలెట్ టేబుల్ కౌంటింగ్‌ను ప్రత్యేకంగా పర్యవేక్షించనున్న ఆర్వో



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03:

లోక్‌సభ ఎన్నికలు-2024, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జూన్ 1న ఏడవ దశతో ప్రశాంతంగా ముగియడంతో గెలుపు ఎవరిది అనే ఉత్కంఠ నెలకొంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిన్ననే ముగియడంతో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఎవరిదనే ఆసక్తి నెలకొంది. ఈ ఉత్కంఠకు మరికొన్ని గంటల్లోనే తెరపడనుంది. మంగళవారం ఉదయం ఏపీతో పాటు దేశవ్యాప్తంగా కౌంటింగ్ ప్రక్రియ షురూ కానుంది. ఈ నేపథ్యంలో అసలు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఎవరెవరు ఏం చేస్తారు? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి.

### ఓట్లు ఎలా లెక్కిస్తారు?

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చాలా విస్తృతమైనది. లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కుని వినియోగించుకుంటారు కాబట్టి లెక్కింపు ప్రక్రియలో వేలాది మంది అధికారులు భాగస్వాములు అవుతారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వికేంద్రీకరిస్తారు. లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే దేశవ్యాప్తంగా ఏకకాలంలో 543 నియోజకవర్గాలలోని కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది.

### ఎవరెవరు ఏం చేస్తారో తెలుసా?


పార్లమెంటరీ నియోజకవర్గానికి కేటాయించిన రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ఓట్ల లెక్కింపు బాధ్యతలను ఆయన నిర్వహిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి ఆర్వోని నియమిస్తుంది. సాధారణంగా స్థానిక ప్రభుత్వ అధికారిని ఆర్వోగా ఎంపిక చేస్తారు. ఇక ప్రతి నియోజకవర్గంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వో ఉంటారు. వీరు ఆర్వోకి సహాయంగా ఉంటారు. ఒక టేబుల్ వద్ద ఈవీఎం లెక్కింపుకు బాధ్యతను ఏఆర్వో నిర్వహిస్తారు. ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను ఆర్వో పర్యవేక్షిస్తారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ సూపర్‌వైజర్ ఉంటారు. మరోవైపు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా గమనిస్తుంటారు. నియోజకవర్గానికి సంబంధించిన రౌండ్లు, ఓట్ల సంఖ్య ఆధారంగా ఫలితం వెలువడే సమయం ఆధారపడి ఉంటుంది.

### ఎక్కడ లెక్కిస్తారు?

ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో నియోజకవర్గానికి ఒకే ప్రదేశాన్ని కేటాయిస్తారు. అయితే ఓటర్ల సంఖ్య భారీగా ఉంటే మరిన్ని కౌంటింగ్ కేంద్రాలను కేటాయించే అవకాశాన్ని ఈసీ కల్పిస్తుంది. ఇందుకోసం పెద్ద హాల్‌ను ఎంపిక చేస్తారు. సాధారణంగా ప్రభుత్వ బడులు, కాలేజీలు లేదా సంబంధిత నియోజకవర్గానికి సంబంధించిన ఆర్వో ప్రధాన కార్యాలయాన్ని కౌంటింగ్ కేంద్రంగా ఎంపిక చేస్తారు. ఇక ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. కౌంటింగ్ పూర్తయిన వెంటనే నియోజకవర్గానికి సంబంధించిన ఫలితాన్ని ఆర్వో ప్రకటిస్తారు. ఈ ఫలితాలు సాధారణంగా టీవీ, ఇతర మీడియా మాధ్యమాల ద్వారా ముందుగానే జనాలకు చేరతాయి. కేంద్ర ఎన్నికల సంఘం కూడా అధికారికంగా ప్రకటిస్తుంది.

# వైసీపీ శ్రేణులు సంబరాలకు సిద్ధంగా ఉండాలి: సజ్జల

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 03:
నేడుఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒకవేళ టీడీపీ వాళ్లు అధికారంలోకి వస్తారనుకుంటే, ఈ రెండ్రోజులు సంయమనంతో ఉంటే సరిపోతుందని, కానీ వాళ్లు ఏదో రకంగా హడావిడి చేయాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారని సజ్జల విమర్శించారు. ఇష్టం వచ్చినట్టు రాతలు రాస్తున్నారని, లేఖలు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇక, నేడుకౌంటింగ్ రోజున వైసీపీ ఏజెంట్లందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. కౌంటింగ్ పూర్తయి, ఫలితంపై డిక్లరేషన్ తీసుకునేంతవరకు ఏజెంట్లు అక్కడ్నించి కదలొద్దని అన్నారు. నేడుఉదయం 11 గంటల కల్లా ఫలితాల ట్రెండ్ అర్థమైపోతుందని, వైసీపీ శ్రేణులు సంబరాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని అపోహలు సృష్టించినా, నేడువైసీపీ విజయం సాధించడం ఖాయమని సజ్జల ఉద్ఘాటించారు."కానీ మీరు గమనించారో లేదో... చంద్రబాబునాయుడు మాత్రం సైలెంట్ గా ఉన్నాడు. ఆయన మాత్రం ఎక్కడా మాట్లాడడం లేదు. చాలా గుంభనంగా వ్యవహరిస్తున్నాడు. బహుశా నేడుకౌంటింగ్ రోజున ఫలితాలు ఎలా వస్తాయో ఆయనకు అర్థమై ఉంటుంది. అందుకోసం మానసికంగా సిద్ధమైనట్టున్నాడు. ఇక



లోకేశ్ దేశంలోనే ఉన్నట్టు లేదు... ఇవాళ వచ్చాడా... ఇన్నాళ్లు ఇక్కడ ఉన్నట్టు లేదు. నిన్న ఇండియా టుడే- మై యాక్సిస్ ఎగ్జిట్ పోల్ లో పొంతన లేని అంకెలు చూసి అందరూ నవ్వుకుంటున్నారు. జనసేన 7 శాతం ఓట్ షేర్ తో 21 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలుస్తుందని అందులో పేర్కొన్నారు. అదేమైనా నమ్మే విధంగా ఉందా? లోక్ సభ స్థానాల్లో మాకు 2 నుంచి 4 వస్తాయని ఎంతో ఉదార స్వభావంతో తెలియజేశారు. కేంద్రంలో ఎన్డీయేకి 400 మార్కు అందించాలన్న ఉద్దేశంతోనే ఆ ఎగ్జిట్ పోల్ లో స్థానాల సర్దుబాటు చేసినట్టు అర్థమవుతోంది" అని సజ్జల వివరించారు.